
ఎల్లమ్మ ఆలయం వద్ద కార్పొరేటర్ నర్సింహయాదవ్ తదితరులు

ఎల్లమ్మను దర్శించుకున్న కార్పొరేటర్

ఫతేనగర్, మే 13(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ మంగళవారం బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. అమ్మవారికి కానుకలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ వెంట ముద్దం ఆనంద్‌యాదవ్, పెంటయ్య, బుర్రి యాదగిరి, కృష్ణయాదవ్, రమేశ్ ఉన్నారు.


ఏసీపీ నరేశ్‌రెడ్డిని కలిసిన దళిత సంక్షేమ సంఘం సభ్యులు

ఏసీపీ నరేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు

బాలానగర్, మే 13(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన పింగళి నరేశ్‌రెడ్డిని బాలానగర్‌కు చెందిన దళిత సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏసీపీని సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆదిముళ్ల రాము, సలహాదారుడు మదాసు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి రమేష్ తదితరులు ఉన్నారు.


బుద్ధుడి విగ్రహానికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్ తదితరులు

బుద్ధుడి సూక్తులను ప్రతి ఒక్కరూ ఆచరించాలి

ఓల్డుబోయినపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): శాంతిని బోధించిన బుద్ధుడి సూక్తులను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ సూచించారు. బుద్ధ జయంతి సందర్భంగా ఓల్డుబోయినపల్లి డివిజన్ పరిధిలోని సిండికేట్ బ్యాంక్ ఆఫీసర్స్ కాలనీ వాసులు ఏర్పాటు చేసిన విగ్రహానికి కార్పొరేటర్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిని కాంక్షించే కాలనీవాసులు బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్‌శాస్త్రి, సెక్రెటరీ రామారావు, ఉపాధ్యక్షుడు బి.సుధాకర్‌రావు, కోశాధికారి నవీన్, సీనియర్ నాయకులు సూర్య ప్రకాష్‌రావు, హనుమంతరావు, ప్రదీప్, శ్రీహరి, అంజయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి శృంగేరి శంకరమఠం వార్షికోత్సవాలు

అల్లాపూర్, మే 13(ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ పరిధిలోని శృంగేరీ శారదా శంకర మఠంలో ఈ నెల 17 నుంచి షడ్వింశతి (26వ వార్షికోత్సవం) కార్యక్రమాలు జరగనున్నాయని మఠం ప్రతినిధి సీఎస్ఆర్ మూర్తి తెలిపారు. వచ్చే శనివారం 17న ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమాల్లో భాగంగా గురువందనం, గురుపాదుక పూజ, కలశ స్థాపన, సాయంత్రం రుద్రహోమ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి.

కేపీహెచ్‌బీలో ఆక్రమణల తొలగింపు

కేపీహెచ్‌బీకాలనీ, మే 13(ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ పోచమ్మ తల్లి ఆలయం నుంచి టెంపుల్ బస్టాపులోని మీ సేవా రోడ్డులో ఆక్రమణలను తొలగించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలతో ఆ మార్గంలో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం సాయంత్రం తొలగింపు చర్యలు చేపట్టారు. శాశ్వత పరిష్కారం కాకుండా అరకొరగా తొలగిస్తూ మళ్లీ ఏర్పాటుకు అవకాశం కల్పించడంపై పోలీసుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. చికెన్ పకోడీ రోడ్డుగా పేరుగాంచిన ఆ మార్గంలో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు పడుతన్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఏదో చేశాం అనిపించుకోవడం తప్ప సమస్యకు పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆరోపించారు. వ్యాపారులు సైతం పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా జేసీబీలతో రావడం ఏంటని ప్రశ్నించారు. వారం రోజుల్లో తొలగిస్తామని, అప్పటి వరకు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేయడంతో వ్యాపారులు శాంతించారు.


జేసీబీలతో ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

హైడ్రా అధికారుల తీరుతో ఇళ్లలోకి నీళ్లు

● బీజేపీ నేత రాజేశ్వర్‌రావు

కూకట్‌పల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): నల్ల చెరువు సుందరీకరణ పేరుతో ముందస్తు ప్రణాళిక లేకుండా చేస్తున్న పనులతోనే వరదనీరు ఇళ్లలోకి చేరుకుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావుతో కలిసి నల్లచెరువుకు అనుకుని ఉన్న కాలనీల్లో పర్యటించారు. అకాల వర్షంతో ఇళ్లలోకి నీరు చేరుకుందని కాలనీవాసులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైడ్రా అధికారుల తీరుతోనే ఇళ్లలోకి నీరు చేరుతుందన్నారు. చెరువులో మట్టి పోయడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తమైందన్నారు. వెంటనే జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సూర్యరావు, శ్రీకర్‌రావు, నాగరాజు, శంకర్‌రెడ్డి విశాల్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.


నల్లచెరువు పరిసర ప్రాంతాలలో పర్యటిస్తున్న రాజేశ్వర్‌రావు తదితరులు

ఎంపీ ఈటలను విమర్శిస్తే ఊరుకోం..

నిరంతరం ప్రజల సమస్యలపై గళమెత్తుతున్న బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు, బీజేపీ కార్యవర్గ సభ్యులు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఎంపీ ఈటలపై ఎవరు విమర్శలు చేసినా ఉరుకునేది లేదన్నారు. ఈటల గురించి మాట్లాడే అర్హత జగ్గారెడ్డికి లేదన్నారు. బాచుపల్లిలోని మేడికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన అపార్టుమెంట్‌లో 80 కుటుంబాలను ఖాళీ చేయమని తహసీల్దార్ ఆదేశించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల పక్షాన ఎంపీ ప్రశ్నిస్తున్నారని, అలాంటి వారిపై విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు.


బండి రమేష్‌ను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారానికి రావాలని ఆహ్వానం

బాలానగర్, మే 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న జరిగే కూకట్‌పల్లి సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాలని కమిటీ సభ్యులు కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు, ఆలయ కమిటీ సభ్యులు మాధవరం శ్రీనివాసరావు, మేకల సుదర్శన్, చెదురుపల్లి శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్, రాజూయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో చైన్ స్నాచింగ్

హైదర్‌నగర్, మే 13(ఆంధ్రజ్యోతి): నడిచి వెళ్తున్న యువతి మెడలో నుంచి చైన్ లాక్కుని ఓ గుర్తుతెలియని వ్యక్తి పరారయ్యాడు. కేపీహెచ్‌బీ డీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపాటి జగతి అనే యువతి కేపీహెచ్‌బీ కాలనీలో హాస్టల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. సోమవారం రాత్రి తన స్నేహితురాలు ఐశ్వర్యతో కలిసి ఆఫీస్ నుంచి వస్తూ బస్టాప్‌లో బస్ దిగి నడుచుకుంటూ హాస్టల్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో 25 నుంచి 30సంవత్సరాలు ఉన్న వ్యక్తి వారికి ఎదురుగా నడుచుకుంటూ వచ్చి జగతి మెడలోని చైన్ లాక్కుని పరారయ్యాడు. చైన్ లాగే క్రమంలో జగతి చెయ్యితో పట్టుకోవడంతో కొంత భాగం ఆమె చేతిలో వుండిపోగా లాక్కెళ్లిన చైన్ తులం ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీ

అల్లాపూర్, మే 13(ఆంధ్రజ్యోతి): తమ ఇంటి ముందు పార్క్ చేసిన బైక్ చోరీకి గురైన సంఘటన అల్లాపూర్ పీఎస్ పరిధిలోని వివేకానంద నగర్‌లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో నివసించే కురుముజి అప్పలచారి రోజూ లాగే గత ఆదివారం రాత్రి తన ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేశాడు. తెల్లవారి లేచి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలలో గాలించాడు. విషయాన్ని అల్లాపూర్ పోలీసులకు తెలియజేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగేందుకు నీళ్లు కూడా ఇవ్వలేరా?

● జలమండలి మేనేజర్‌ను ప్రశ్నించిన కార్పొరేటర్ మందడి

కేపీహెచ్‌బీకాలనీ, మే 13 (ఆంధ్రజ్యోతి): తాగటానికి నీళ్లు కూడా ఇవ్వలేరా, పొంగుతున్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపరా? అని కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు జలమండలి మేనేజర్‌ను ప్రశ్నించారు. కేపీహెచ్‌బీ ఏడో ఫేజ్‌లో తాగునీటి సరఫరా సమస్యను స్థానికులు, జలమండలి మేనేజర్ శ్రీకాంత్ రెడ్డితో కలిసి ఆయన మంగళవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లోప్రెషర్ వల్ల ఇబ్బంది పడుతున్నామని, డ్రైనేజీ సమస్య తరచూ వస్తోందని స్థానికులు కార్పొరేటర్‌కు విన్నవించారు. ప్రజలకు తాగేందుకు నీరు కూడా ఇవ్వలేరా అని జలమండలి మేనేజర్ శ్రీకాంత్ రెడ్డిని కార్పొరేటర్ ప్రశ్నించారు. ఎక్కువ ప్రెషర్‌తో తాగునీటిని సరఫరా చేయాలని, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని జలమండలి మేనేజర్‌ను కార్పొరేటర్ ఆదేశించారు. కార్యక్రమంలో ప్రతాప్ కుమార్, బత్తుల హరిబాబు, అల్లం వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి లక్ష్మీనారాయణ, పొడుగు అప్పారావు, బత్తుల వేణు తదితరులు పాల్గొన్నారు.


హైప్రెషర్‌తో తాగునీటిని సరఫరా చేయాలని జలమండలి మేనేజర్‌ను ఆదేశిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు



క్రీడాకారులతో గేమ్స్ జాయింట్ కమిషనర్ వాణిశ్రీ

విద్యార్థులు సమ్మర్ క్యాంపులను వినియోగించుకోవాలి

చందానగర్, మే 13(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ నిర్వహించే సమ్మర్ క్యాంపులను విద్యార్థులు వినియోగించుకొని లబ్ధిపొందాలని జీహెచ్ఎంసీ గేమ్స్ జాయింట్ కమిషనర్ వాణిశ్రీ సూచించారు. పీజేఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో వేలాది మంది చిన్నారులు ఈ క్యాంపులను వినియోగించుకుంటున్నారన్నారు. ఈ నెల చివరి వరకు క్యాంపులు కొనసాగుతాయని, ఇప్పుడు కూడా క్యాంపుల్లో చేరవచ్చని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో వెస్ట్ జోన్ గేమ్స్ ఇన్‌స్పెక్టర్ విరానంద్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోస్టల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

పోస్టల్ కార్యాలయాన్ని మరోచోటకు తరలించాలి

- బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్

చందానగర్, మే 13(ఆంధ్రజ్యోతి): చందానగర్ పోస్ట్ ఆఫీస్‌లో సౌకర్యాలు కల్పించాలని, పై అంతస్తులో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకుడు మారబోయిన రవికుమార్‌యాదవ్ అన్నారు. చందానగర్ పోస్టల్ కార్యాలయాన్ని మంగళవారం పార్టీ నాయకులతో కలిసి రవికుమార్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయం మొదటి అంతస్తులో ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెలా పింఛన్ల కోసం వచ్చేవారు మెట్లు ఎక్కలేకపోతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మరో చోటకు మార్చేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు బుచ్చిరెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్, కృష్ణమూర్తి, శేఖర్ ముదిరాజ్, శంకర్‌రెడ్డి, కృష్ణకాంత్, మూర్తి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

ఖేల్‌కాలనీ, మే 13(ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్‌లోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు నేటితో ముగియనున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. కుంకుమార్చన, మహాలక్ష్మి హోమం చేశారు. ఉత్సవ మూర్తులను గజవాహనంపై ఊరేగించారు. నేడు కోనేరులో జరిగే చక్రస్నానంతో ఉత్సవాలు ముగియనున్నాయి.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, మే 13(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారి, ఎన్టీఆర్‌నగర్, ఉషా ముళ్లపూడి రోడ్డులో సోమవారం కురిసిన వర్షంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయా ప్రాంతాలకు చేరుకుని జీహెచ్ఎంసీ సిబ్బందితో వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ నిండి రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీటిని వెంటనే సిబ్బంది తొలగించారన్నారు. ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అకాల వర్షాలతో ఎటువంటి ఇబ్బందులు కలిగినా వెంటనే సంబంధిత అధికారులకు, తనకు సమాచారం ఇవ్వాలన్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను కోరారు.



రోడ్లపై నీటిని తొలగించే పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

గచ్చిబౌలి, మే 13(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని సీపీఐ నాయకలుఌ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం శేరిలింగంపల్లి మండల సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి స్థిరపడ్డ పేదలు అద్దెలు చెల్లించలేని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారన్నారు. అర్హులకు ఇళ్లు ఇచ్చేంతవరకు ఉద్యమం చేస్తామని, ఈ నెల 20 నుంచి ఉద్యమిస్తామన్నారు.



విజేతలతో బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ గోపీచంద్

ఓవరాల్ ఛాంపియన్ ఇన్ఫోసిస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హెచ్‌వైసీఈఏ) నిర్వహించిన కార్పొరేట్ స్పోర్ట్స్ టోర్నమెంట్‌లో ఇన్ఫోసిస్ జట్టు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. టీసీఎస్ రన్నరప్‌గా నిలవగా సింక్రోనీ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో జరిగిన ముగింపు వేడుకల్లో జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, హెచ్‌వైసీఈఏ అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

రాయదుర్గం, మే 13(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాల్లో రాజీపడకుండా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అనంతరం ఆయన కాలనీలో పర్యటించి స్థానికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో అన్ని సమస్యలు పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రషీద్, గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షుడు శివసింగ్, నాయకులు కైలాసింగ్, సుమన్, శ్రీకాంత్‌రెడ్డి, బాబ్లీసింగ్, గోపాల్, గణేష్ సింగ్, రంజిత్‌సింగ్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.



గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

నాణ్యతా లోపంతో వర్షానికి ధ్వంసమైన రోడ్డు

మియాపూర్, మే 13(ఆంధ్రజ్యోతి): మియాపూర్ దీప్తిశ్రీనగర్ నుంచి జాతీయ రహదారి(65)కి వెళ్లే రోడ్డును గతంలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం తవ్వారు. అనంతరం మరమ్మతులు చేశారు. అయితే నాణ్యత లోపం కారణంగా సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై వేసిన కంకర, సిమెంట్ కొట్టుకుపోయింది. దీంతో రోడ్డు గుంతలమయంగా మారింది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులు చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సిద్ధిక్‌నగర్ సంక్షేమ సంఘం సభ్యులతో ఎమ్మెల్యే గాంధీ

కాలనీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయండి

గచ్చిబౌలి, మే 13(ఆంధ్రజ్యోతి): సిద్ధిక్‌నగర్ సంక్షేమ సంఘం నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. సంక్షేమ సంఘం ఎన్నికల్లో గెలుపొందిన కమిటీ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే గాంధీని కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గాంధీ మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యదర్శి రవీందర్ రెడ్డి, కోశాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

చందానగర్, మే 13(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో పాపిరెడ్డికాలనీ,నందయ్యనగర్, రాజీవ్ గృహకల్పలో కొన్ని చోట్ల విద్యుత్ దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో విధులు ముగించుకొని వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్ ధర్మపురి క్షేత్రానికి వెళ్లే రహదారి పొడవునా విధి దీపాలు వెలగడం లేదు. ఈ మార్గం నుంచి రాకపోకలు సాగించే వారు రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

11వ అంతస్తు నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

రాయదుర్గం, మే 13(ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శివపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక మంగులూరుకు చెందిన గౌతంశెట్టి(29) ఏడేళ్ల క్రితం నగరానికి వచ్చి టీఎన్‌జీఓ కాలనీలో కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. సుమారు ఆరునెలలుగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న గౌతంశెట్టి డిప్రెషన్‌కు గురై సోమవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో తాను నివాసం ఉంటున్న మైహోం విహంగ బిల్డింగ్ 11వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

అర్ధరాత్రి తీవ్రగాయాలతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

● బైక్ అదుపు తప్పి పడిపోయాడా?

ఏదైనా వాహనం ఢీకొట్టిందా అనే అనుమానాలు


త్రివేద్ (ఫైల్)

నిజాంపేట్, మే 13(ఆంధ్రజ్యోతి): అనుమానాస్ప దస్థితిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని సాయినగర్ చౌరస్తాలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... భద్రాది- కొత్తగూడెం జిల్లా దొమ్మన్‌పేట మండలానికి చెందిన రాజులపాటి త్రివేద్ (40) నగరంలో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య సుమలతతో కలిసి ప్రగతినగర్ ప్రాంతంలోని మధురానగర్‌రోడ్డు నెంబర్ 5లోని పవన్ హైట్స్‌లో నివాసముంటున్నాడు. సోమవారం డ్యూటీకి వెళ్లిన త్రివేద్ రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వస్తూ, సాయినగర్ చౌరస్తాలోని చివాస్ ప్రాంతంలో గాయాలతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి వివరాలు సేకరించిన పోలీసులు భార్య సుమలతకు సమాచారం ఇచ్చారు. బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి భార్య గాంధీ ఆస్పత్రివెళ్లి డాక్టర్లను సంప్రదించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. డ్యూటీకి వెళ్లిన తన భర్త రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా సాయినగర్ కమాన్ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడి మృతి చెందాడా? ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయిందా? అనే అనుమానాలను భార్య సుమలత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వ్యక్తం చేసింది. ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తగిన చర్య లు తీసుకోవాలని ఆమె పోలీసులను కోరింది. ఈ మేరకు పోలీసులు కేసు న మోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృత దేహం

పేట్‌బషీరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీ సుల కథనం ప్రకారం.. జీడిమెట్ల పేట్‌బషీరాబాద్‌లోని పిస్తా హౌస్‌కు ఎదురుగా గల సర్వీస్ రోడ్డులోని చెట్టు సమీపంలో 50 నుంచి 55 వయస్సు గల ఓ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతుడి వివరాల కోసం స్థానికంగా ఆరా తీసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి, గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నలుపు రంగు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడని, ఎవరికైనా అతడి వివరాలు తెలిస్తే పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


వరప్రసాద్

గాజులరామారం,మే13(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన సూరారం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవేందర్‌నగర్‌కు చెందిన పెద్దపాటి వరప్రసాద్ (36) కార్పెంటర్. ఈ నెల 12న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుంటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు.

పని కోసం వెళ్లిన మేస్త్రీ..


వెంకటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొలనాటి వెంకటేశ్వరరావు (35) భార్య వెంకటలక్ష్మితో కలిసి 8 నెలల క్రితం నగరానికి వచ్చి రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. సూరారం ప్రాంతంలో మేస్త్రీ పని చేస్తున్న వెంకటేశ్వరరావు గత నెల 30న పని కోసం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. భార్య చుట్టపక్కల గాలించడంతో పాటు బంధు,మిత్రులను వాకబు చేసినా భర్త ఆచూకీ లభించలేదు. దీంతో వరప్రసాద్ తండ్రి రామబ్రహ్మం, వెంకటేశ్వరరావు భార్య వెంకటలక్ష్మిలు మంగళవారం సూరారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్


భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

పేట్‌బషీరాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌ను ఆదర్శ వంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని భూదేవి హిల్స్‌లో రూ. 6 లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్లలో కోట్లాది రూపాయలు వెచ్చించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా మన్నారు. లింక్ రోడ్డులను ఎందుకు అభివృద్ధి చేయడం లేదని స్థానికు లు కొందరు ఎమ్మెల్యేను అడగ్గా, పనులు ఎందుకు నిలిచిపోయాయో మీ వద్దకు వస్తున్న నాయకులను అడిగితే తెలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. తాను ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, వెంటేశ్వర ఆలయ మాజీ చైర్మన్ వేణుయాదవ్, జైహింద్ పాల్గొన్నారు.

● జీడిమెట్ల డివిజన్‌లోని వైష్ణవి ఎన్‌క్లేవ్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి, పార్కును అభివృద్ధి చేయించాలని అధ్యక్షుడు ఆర్.వెంకటేష్ గౌడ్ కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శ ఎంపీఆర్ చంద్రశేఖర్, కోశాధికారి రాకేష్, హుస్సేన్, టీకే గౌడ్, నాగరాజు. శ్రీనివాస్, పాండు ఉన్నారు. అలాగే సుభాష్‌నగర్ డివిజన్‌లోని సూరారం కాలనీకి చెందిన పలువురు మిగిలి పోయిన పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

నీటి సమస్య లేకుండా చర్యలు

● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి


కొలన్ హన్మంత్‌రెడ్డిని కలిసిన ప్రాగాటూల్స్ కాలనీవాసులు

దుండిగల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని ప్రాగా టూల్స్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం ఆయనను కలిసి తమ ప్రాంతంలో నెలకొన్న తాగునీటి సమస్య గురించి వివరించారు. ప్రభుత్వం దృష్టికి మీ కాలనీలోని నీటి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తానని వారికి హన్మంత్ రెడ్డి హామీ ఇచ్చారు. నాయకులు శ్రవణ్‌కుమార్, ప్రసాద్‌రావు, రాంబాబు, సుదర్శన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, పరమేశ్వర్‌రావు, గంగాధర్ పాల్గొన్నారు.

రోడ్లపై వర్షం నీరు.. రాకపోకలకు అవస్థలు


సాయిబాబా చౌరస్తా బస్సు షెల్టర్ ముందు ఇలా..


గండిమైసమ్మ చౌరస్తా సిగ్నల్స్ వద్ద మోకాలు లోతు చేరిన వర్షపు నీరు

దుండిగల్, మే 13(ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో శివారు ప్రాంతాల్లోని రోడ్లు జలమయం అయ్యాయి. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి సూరారం, గండి మైసమ్మచౌరస్తా, దుండిగల్ సారెగూడెం అవుటర్ జంక్షన్ వద్ద వర్షపు నీరు రోడ్లపైకి చేరాయి. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రోడ్లపైపైనే మోకాలు లోతు నిలిచింది. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దాటిన తరువాత సాయిబాబా చౌరస్తా బస్టాప్ వద్ద ఏ మాత్రం వర్ష కురిసినా, ఒక వైపు రోడ్డు ఒంపుగా ఉండంతో నీరంతా నిలిచిపోతోంది.

● బస్టాప్ వద్ద నిర్మించిన ఫుట్‌పాత్‌లు మునిగే విధంగా నీరు చేరడం, ఆప్రాంతంలో ఉన్న నివాసితులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. అదే విధంగా గండిమైసమ్మ చౌరస్తాలో సిగ్నల్ వద్ద ఒక వైపు రోడ్డులో పూర్తిగా నీరు చేరి కార్ల టైర్లు మునిగే పరిస్థితి ఏర్పడింది.

● రాత్రి కురిసిన వర్షం నీరు మంగళవారం సాయంత్రం వరకు రోడ్లపై నిలిచి ఉంది. ఆ నీటిలోనే వాహనదారులు రాకపోకలు సాగించారు. అదే విధంగా సారెగూడెం అవుట్ రోడ్డు జంక్షన్ వద్ద మిర్చిలే-అవుట్ ముందు కాలనీవాసులు లోనికి వెళ్లే పరిస్థితి లేదు. అక్కడ కూడా భారీగా వర్షపు నీరు చేరింది. ఏడాదిగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉంది. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారుల స్పందించి సాయిబాబా నగర్ చౌరస్తాతో పాటు దుండిగల్ మున్సిపల్ చౌరస్తాల్లో వర్షపు నీరు ఎప్పటికప్పుడు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పార్టీ నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

ప్రజల కోసం పని చేసేది కమ్యూనిస్టులే

● సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏసు రత్నం

పేట్‌బషీరాబాద్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పని చేసిన వారే నిజమైన కమ్యూనిస్టులని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఏసు రత్నం అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని నల్లమల్ల గిరిప్రసాద్ విజ్ఞాన కేంద్రంలో 25వ జగద్గిరిగుట్ట శాఖ మహాసభలు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ వెంకటేశ్వ అధ్యక్షతన జరిగాయి. ఆయనతో పాటు మండల కార్యదర్శి ఉమామహేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సీపీఐ నుంచి కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేసి గెలవాలంటే నాయకత్వం ఐక్యతతో ఉంటూ, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శిగా ఎం సహదేవ్ రెడ్డి, సహాయ కార్యదర్శులుగా బి.రాజు. పి.చంద్రయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో శాఖ మాజీ కార్యదర్శి చర్లపల్లి రాములు, ప్రజా నాట్యమండలి అధ్యక్షుడు దొరవి బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఐడీపీఎల్‌లో పని చేయని సిగ్నళ్లు

'సిగ్నల్స్' పని చేయక వాహనదారుల అయోమయం

కుత్బుల్లాపూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు సరిగా పని చేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా ఐడీపీఎల్ చౌరస్తాలో నిత్యం ఏదో ఒక కారణంతో సిగ్నళ్లు పని చేయడంలేదని వాహనదారులు చెప్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ అధికంగా ఉన్న సమయంలో సిగ్నల్స్ పని చేయక అయోమయానికి గురవుతున్నామని వాహనదారులు చెప్తున్నారు. వెంటనే సిగ్నల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీటి లీకేజీని అరికట్టాలి



కుత్బుల్లాపూర్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ శ్రీనివాస్‌నగర్ నుంచి శివారెడ్డినగర్ వెళ్లే రోడ్డులో ఉన్న తాగునీటి వాల్వ్ పాడై పోయింది. నీటిని వదిలిన సమయంలో లీకేజీ అవుతోంది. లీకైన నీరంతా వాల్వ్ వద్ద నిలిచి బురదగా మారడంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, వెంటనే మరమ్మతులు చేయించాలని స్థానికులు జలమండలి అధికారులను కోరుతున్నారు.